సాక్షి
ఖమ్మం
ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



ప్రైవేట్ డెయిరీలో పేలుడు

అనుమతి లేకుండా జనావాసాల నడుమ నిర్వహిస్తున్న డెయిరీలో బాయిలర్ పేలగా భారీ శబ్దంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. 8లో



తక్షణమే అమలుచేయాలి

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలుచేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి డిమాండ్ చేశారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రత ఎక్కువగానే నమోదవుతుంది. ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

పార్లమెంటరీ ఆర్థిక కమిటీ సభ్యుడిగా ఎంపీ నామ



నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: పార్లమెంటరీ ఆర్థిక కమిటీ సభ్యులుగా బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు నియమితులయ్యారు. 2023–2024 ఆర్థిక సంవత్సరానికి గాను ఆయనను నియమిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మందితో ఏర్పాటైన ఈ కమిటీలో సభ్యుడైన ఎంపీ నామ పలు ఆర్థిక అంశాలపై ఆర్థిక కమిటీకి సూచనలు ఇచ్చే అవకాశముంటుంది. ఆయన నియామకంపై ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

జమలాపురంలో ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూల విరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం జరిపించాక, స్వామి, అమ్మ వార్ల ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. ఆతర్వాత పల్లకీ సేవ నిర్వహించగా తెలంగా, ఏపీ నుంచి పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో డీఐజీ తనిఖీ



మహిళా ఖైదీలతో మాట్లాడుతున్న డీఐజీ

ఖమ్మంరూరల్: మండలంలోని దానవాయిగూడెంలో జిల్లా జైలును జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ ఎం.సంపత్ శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఖైదీల బ్యారెక్‌లను పరిశీలించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే, ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులు, ఆహారం నాణ్యతపై ఆరా తీశారు. ఆతర్వాత మహిళా ఖైదీలతో డీఐజీ మాట్లాడారు. అలాగే, ఖైదీలతో నిర్వహిస్తున్న పరిశ్రమలను, పెట్రోల్ బంక్‌ను పరిశీలించిన ఆయన భద్రత, ఖైదీల ఆరోగ్యంపై అధికారులకు సూచనలు చేశారు. జైలు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ జి.వెంకటేశ్వర్లు, జైలర్లు ఏ.నక్రు, జి.లక్ష్మీనారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంట్లోనూ చదివే వాతావరణం ఉండాలి



మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసాచారి

కూసుమంచి: విద్యార్థులు పాఠశాల నుంచి వచ్చాక ఇళ్లలోనూ చదువుకునే వాతావరణం ఉండేలా తల్లిదండ్రులు కృషి చేయాలని విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి సూచించారు. మండలంలోని నేలపట్ల, కూసుమంచి, పాలేరు పాఠశాలలను శనివారం తనిఖీ చేసిన ఆయన మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు. అలాగే, విద్యార్థులకు అందిస్తున్న రాగిజావ నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం తల్లిదండ్రులతో ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఏడీ మాట్లాడుతూ పిల్లలకు సెల్‌ఫోన్లు ఇచ్చి భవిష్యత్‌ను నాశనం చేయొద్దని కోరారు. పాఠశాల నుంచి వచ్చాక కూడా చదువుకునేలా సిద్ధం చేయాలని, తరచుగా వారి ప్రగతిపై ఉపాధ్యాయులతో చర్చించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సీఎంఓ రాజశేఖర్, ఎంఈఓ రామాచారి, హెచ్‌ఎంలు వీరస్వామి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి డీఈఐఈడీ పరీక్షలు

ఖమ్మంసహకారనగర్: ఈనెల 25నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు డీఈఐఈడీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఈ పరీక్షలు జరుగుతాయని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఖమ్మంలోని ప్రభుత్వ పాడి పరిశ్రమ డీడీ కార్యాలయం



కదులుతున్న అవినీతి డొంక

- ప్రభుత్వ డెయిరీలో రూ.14లక్షల మేర దుర్వినియోగం
- ఈ ఏడాది జనవరిలోనే గుర్తించిన యంత్రాంగం
- హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో రేపు విచారణ
- సస్పెన్షన్‌లో ఉన్న అధికారులు, ఉద్యోగులు రావాలని నోటీసులు

నోటీసులు పంపించాం..

పాడి పరిశ్రమలో అవినీతి, అక్రమాల వ్యవహారంపై రాష్ట్ర సంస్థ జారీ చేసిన నోటీసులను సంబంధిత అధికారులు, ఉద్యోగులకు పంపించాం. హైదరాబాద్‌లో సోమవారం జరిగే విచారణకు వారు హాజరుకావాల్సి ఉంటుంది.

– డాక్టర్ కుమారస్వామి, డీడీ, పాడి పరిశ్రమ, ఖమ్మం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం ప్రభుత్వ పాడి పరిశ్రమ(విజయ డెయిరీ)లో జరిగిన అవినీతి, అక్రమాల నిగ్గు తేల్చడంపై రాష్ట్ర యంత్రాంగం దృష్టి సారించింది. పాలు, పాల పదార్థాల విక్రయం, యంత్ర పరికరాల కొనుగోలులో రూ.లక్షల్లో అవినీతి జరిగినట్లు గుర్తించిన సంస్థ సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ క్రమంలో విచారణాధికారిగా రాష్ట్ర సహకార శాఖకు చెందిన రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ కె.నరేందర్‌రెడ్డిని ఇటీవల నియమించారు. దీంతో ఆయన సోమవారం విచారణ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌లో ఉన్న నలుగురు అధికారులు, ఉద్యోగులను హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగే విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు.

వరుసగా ఆరోపణలు...

ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో విజయ డెయిరీ పేరిట ప్రభుత్వ పాడి పరిశ్రమలో రూ.14 లక్షల మేర అవినీతి జరిగినట్లు సంస్థ గుర్తించింది. ఖమ్మం యూనిట్‌లో గత కొన్నేళ్లుగా అక్రమాలు సర్వసాధారణమయ్యాయి. 2021 తర్వాత ఇక్కడ పాలు, వెన్న పెద్ద ఎత్తున పక్కదారి పట్టినట్లు తేలింది. దీంతో పాటు యంత్ర పరికరాల కొనుగోళ్లలో కూడా అవినీతి జరిగిందని తేల్చారు. దాదాపు రూ.40 లక్షలకు పైగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తగా... ఈ ఏడాది జనవరి చివరి వారంలో విషయం బయటపడింది. సంస్థలోని ఉద్యోగుల నడుమ అంతర్గత విబేధాలతో విషయం బయటకురాగా, ఖమ్మం డెయిరీలో డీడీగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారి సత్యనారాయణను మాతృసంస్థకు పంపించారు. ఆతర్వాత మేనేజర్ భరతలక్ష్మి, గతంలో మేనేజర్‌గా పనిచేసి నల్లగొండకు బదిలీ అయిన నరేష్, ల్యాబ్ అసిస్టెంట్ నాగశ్రీ, ప్లాంట్ ఆపరేటర్ మణిని సస్పెండ్ చేశారు. అయితే భరతలక్ష్మి హైకోర్టును ఆశ్రయించారు. ఈక్రమంలోనే రాష్ట్ర అధికారులు పరిశీలించగా... రూ.14 లక్షల అవినీతి జరిగినట్లు నిర్ధారించారు.

మళ్లీ తెరపైకి..

ఈ ఏడాది జనవరిలో పాడి పరిశ్రమలోని అవినీతిని గుర్తించిన ఉన్నతాధికారులు డీడీని మాతృసంస్థకు పంపించడమే కాక నలుగురిని సస్పెండ్ చేశారు. ఆతర్వాత విచారణలో ఎలాంటి కదలిక కనిపించలేదు. ఈ వ్యవహారంపైనే ఓ మేనేజర్ హైకోర్టును ఆశ్రయించారు. మళ్లీ తొమ్మిది నెలల తర్వాత సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అదర్ సిన్హా ఖమ్మం పాడి పరిశ్రమలో జరిగిన అవినీతి వ్యవహారంపై విచారణకు నిర్ణయించారు. ఈక్రమంలోనే సోమవారం హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం విచారణాధికారి ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకునే అవకాశముందని సమాచారం.

శ్రమ.. కష్టార్జితం బూడిదపాలు



ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్ కళాశాలలో గ్రూప్ -1 పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులు (ఫైల్)

గ్రూప్-1 పరీక్ష రద్దుతో నిరుద్యోగుల ఆవేదన

- ప్రభుత్వ తప్పిదానికి తమను బలి చేయొద్దని వేడుకోలు
- ఉమ్మడి జిల్లాలో పరీక్ష రాసిన 16,203 మంది

కొత్తగూడెంఅర్బన్: తల్లిదండ్రులు చెమట చిందించి సమకూర్చిన డబ్బుతో శిక్షణ తీసుకుంటూ అభ్యర్థులు నిద్రాహారాలు మాని చదువుకుని పరీక్ష రాస్తే.. రేపో, మాపో ఫలితాలు వెల్లడవుతాయని, ఉద్యోగం వస్తుందని ఆశిస్తుండగా... గ్రూప్–1 పరీక్షను రద్దు చేయాలని కోర్టు తీర్పునివ్వడం వారికి ఆశనిపాతంలా మారింది. గతంలోనూ ఓసారి పరీక్ష రద్దు కాగా మళ్లీ సిద్ధమై రాశామని.. ఇప్పుడు కూడా రద్దు చేయడంతో పరీక్షకు సిద్ధం కావడం తమకు తలకు మించిన భారంలా మారుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇక కొందరు వయోపరిమితి దాటుతుండడంతో పరీక్ష రాయగలమా, రాసినా ఉద్యోగం సాధించగలమా అనే మీమాంసతో ఆవేదన అనుభవిస్తున్నారు.

రద్దు చేయండి...

ఈ ఏడాది జూన్ 11న గ్రూప్–1 పరీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 531 పోస్టుల భర్తీ కోసం ఈ పరీక్ష నిర్వహించగా ఖమ్మం జిల్లాలో ఏర్పాటుచేసిన 50 కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న 17,365 మంది అభ్యర్థులకు గాను 10,945 మంది హాజరయ్యారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 22 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 8,851 మందికి 5,258మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. అయితే, పరీక్ష సందర్భంగా అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ విధానంలో నమోదు చేయలేదని, ఓఎంఆర్ షీట్లపై హాల్‌టికెట్ నంబర్, అభ్యర్థుల ఫొటో ముద్రించలేదని చెబుతూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోర్టు శనివారం ఆదేశాలు జారీ చేసింది. కాగా, గతంలోనూ ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా పరీక్షను రద్దు చేయడంతో రెండో సారి నిర్వహించినా టీఎస్‌పీఎస్ తీరుతో రెండోసారీ పరీక్ష కోల్పోయామని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇది ప్రభుత్వ తప్పిదమే...

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష రద్దు కావడానికి ప్రభుత్వ తప్పిదమేనని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఏళ్ల తరబడి రూ.లక్షలు వెచ్చించి ఊరు, తల్లిదండ్రులను వదిలి సిద్ధమైతే చివరకు నిరీక్షణే మిగిలిందని చెబుతున్నారు. ఈ సారి పరీక్ష రాసిన పలువురు అభ్యర్థులు ఉద్యోగం వస్తుందనే ధీమాతో ఉన్నారు. ఇంతలోనే పరీక్ష రద్దు చేయడం, మళ్లీ పరీక్షకు సిద్ధం కావాలంటే డబ్బుకు తోడు సమయం వెచ్చించాల్సి రావడం భారం మారుతుందని అంటున్నారు. కారణాలు ఏవైనా పరీక్ష రద్దు చేయడం, మళ్లీ రాయాల్సి వస్తుండం ప్రభుత్వం, టీఎస్‌పీఎస్ నిర్లక్ష్యానికి నిదర్శమని విమర్శిస్తున్నారు. ముందుగానే అన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని వాపోతున్నారు.

సమయం వృథా అయినట్లే



గ్రూప్–1 పరీక్ష రాసిన పలువురు ఉద్యోగం వస్తుందన్న ధీమాతో ఉన్నారు. ఇప్పుడు పరీక్ష రద్దు కావడంతో ఆందోళన చెందుతున్నాం. చాలామందికి వయోపరిమితి దాటనుంది. అంతే కాక మళ్లీ శిక్షణకు డబ్బు వెచ్చించే పరిస్థితి పలువురికి లేదు. మళ్లీ రాయాలంటే లైబ్రరీలకు పరుగులు తీయాల్సిందే. – జి.మృదుల, కొత్తగూడెం

ఎవరు బాధ్యత వహిస్తారు?



ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోంది. నేను గ్రూప్–1 కోసం 2015 నుంచి సిద్ధమవుతున్నా. హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో శిక్షణ కోసం రూ.లక్షల్లో వెచ్చించా. ఇప్పుడు పరీక్ష మళ్లీ రాయాలంటూ శిక్షణకు డబ్బు వెచ్చించే పరిస్థితి లేదు. ఈ పరిస్థితికి ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలి. – ఏ.సునీత, కొత్తగూడెం

రెండేళ్లు, రూ.2లక్షలు కోల్పోయినట్లే..



రెండేళ్లుగా రూ.రెండు లక్షలు ఖర్చు పెట్టి శిక్షణ తీసుకున్నా. ఇంత కష్టపడి పరీక్ష రాస్తే రద్దు చేయడంతో శ్రమ, డబ్బు కోల్పోయినట్లే. ఈసారి పరీక్ష బాగా రాశాననే నమ్మకంతో మంచి మార్కులు వస్తాయని అంచనా వేశాను. పరీక్ష రద్దుతో నాకే కాదు అభ్యర్థులందరికీ నష్టం జరిగినట్లుగానే భావించాలి. – బి.రవి, కొత్తగూడెం

సొంతింటి కల నెరవేరుస్తున్నాం..

- ఖమ్మంలో అదనంగా వెయ్యి మందికి 'గృహలక్ష్మి'
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ



పట్టాలు అందజేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన మేయర్ నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రతీ పేద వ్యక్తి సొంతింటి కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వివిధ డివిజన్ల లబ్ధిదారులు 315 మందికి జీఓ 58 ద్వారా మంజూరైన పట్టాలతో పాటు 215 మందికి గృహలక్ష్మి మంజూరు పత్రాలను ఆయన అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ స్థలాల్లో 2020 నాటికి నివాసముంటున్న పేదలకు జీఓ 58 ద్వారా పూర్తి హక్కులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే, స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే స్తోమత లేని వారి కోసం గృహలక్ష్మి పథకం అమలుచేస్తున్నామని వెల్లడించారు.

అదనంగా వెయ్యి మందికి...

గృహ లక్ష్మి పథకం కింద జిల్లాలో నియోజకవర్గానికి 3వేల మంది చొప్పున రూ.3లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు మంత్రి పువ్వాడ వెల్లడించారు. అయితే, ఖమ్మం నియోజకవర్గానికి అదనంగా మరో వెయ్యి యూనిట్లు కేటాయించడంతో నాలుగు వేల మందికి గృహలక్ష్మి ద్వారా లబ్ధి జరుగుతుందని చెప్పారు. ఇక జీఓ 58 కింద నగరంలో దాదాపు 5వేల మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తున్నామని తెలిపారు. కాగా, రాష్ట్ర ఐటీ, పురపాలన శాఖ మంత్రి కేటీఆర్ ఈనెల 30న జిల్లాలో పర్యటించి రూ.1,266 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

జీఓ 58 వరప్రసాదం

ఏళ్లుగా ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వారికి జీఓ 58 ఒక వరప్రసాదమని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. తరతరాలుగా నివసిస్తున్నా హక్కు లేదని.. ఇప్పుడు పట్టా వస్తుండడంతో బ్యాంకు రుణాలు అందుతాయని చెప్పారు. కాగా, ఈ జీఓ అమలులో ఖమ్మం జిల్లా ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా, మార్కెట్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, దోరేపల్లి శ్వేత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, ఆర్డీఓ జి.గణేష్, తహసీల్దార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో లోపాలపై 'యూనివర్సిటీ'

నటుడు, దర్శక నిర్మాత నారాయణమూర్తి



మాట్లాడుతున్న నారాయణమూర్తి

ఖమ్మంగాంధీచౌక్: విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ స్నేహచిత్ర బ్యానర్‌పై 'యూనివర్సిటీ' చిత్రాన్ని రూపొందించినట్లు నటుడు, దర్శకనిర్మాత ఆర్.నారాయణమూర్తి తెలిపారు. వచ్చేనెల 13న సినిమా విడుదల కానుండగా శనివారం ఖమ్మం వచ్చిన ఆయన పీజీ కళాశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. ఆతర్వాత జెడ్పీ గెస్ట్‌హౌస్‌లో మాట్లాడుతూ సేవా రంగాలైన విద్య, వైద్యం వ్యాపారమయమయ్యాయని తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తుండడంతో వ్యవస్థ కల్తీ అయిందని పేర్కొన్నారు. పదో తరగతి మొదలు గ్రూప్స్ పరీక్షలకు వరకు ప్రశ్నపత్రాలు లీకేజీ అవుతుండడంతో విద్యార్థుల, యువత భవిష్యత్ ఆగమ్యగోచరంగా మారిందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఇంగ్లిష్‌కు ప్రాముఖ్యత పెరిగిందని.. మాతృభాష తెలుగైతే, మనుగడ భాష ఇంగ్లిష్ అని చెప్పారు. ఏపీలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంగ్లిష్ విద్యకు ప్రాధ్యాత ఇవ్వటం అభినందనీయమన్నారు. ఆ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని నారాయణమూర్తి పేర్కొన్నారు. కాగా, విద్య, వైద్యరంగాల్లోని లోపాలు, పాలకులు అనుసరించాల్సిన విధానాలను వివరించేలా రూపొందించిన 'యూనివర్సిటీ' చిత్రాన్ని అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు.

అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైన నిఘా



మాట్లాడుతున్న సీపీ విష్ణు ఎస్.వారియర్, పక్కన ఏపీ, తెలంగాణ అధికారులు

- ఖమ్మం సీపీ విష్ణు ఎస్.వారియర్
- ఏపీ, తెలంగాణ అధికారులతో సమీక్ష

సత్తుపల్లి: రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తే పటిష్టమైన నిఘా ఉంటుందని ఖమ్మం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ అన్నారు. సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన రెండు రాష్ట్రాల అధికారుల సమావేశంలో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా రూరల్ డీసీపీ అజిత, ఏలూరు ఏఎస్పీ భాస్కర్‌రావు, భద్రాద్రి జిల్లా ఓఎస్డీ సాయిమనోహర్, అడిషనల్ డీసీపీ కేఆర్ కే.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయాన సరిహద్దు రాష్ట్రాల నుంచి మద్యం, డబ్బు తరలింపును కట్టడి చేసేందుకు రెండు రాష్ట్రాల అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, 24గంటల పాటు నిఘా ఉండేలా చెక్‌పోస్టులు ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ అయిన నిందితులను కట్టడి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏసీపీలు బి.రామానుజం, గణేష్, ప్రసన్నకుమార్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు వేగంగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్, అధికారులు

- లోటుపాట్లు ఎదురుకాకుండా జాగ్రత్తలు
- రెవెన్యూ, పోలీసు అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లలో వేగం పెంచాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు అత్యంత ప్రధానమైనవిగా భావించాలని తెలిపారు. నియోజకవర్గాల వారీగా అవసరమైన ఏర్పాట్లు చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. ఇతర రాష్ట్రాలతో సరిహద్దు ఉన్న జిల్లాలోని 12 ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయగా 24గంటల పాటు నిఘా వేయాలన్నారు. అలాగే, ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో 19 చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం పనితీరును పరిశీలించాలని సూచించారు.

దరఖాస్తులు పరిష్కరించండి

ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల కోసం అందిన దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. నియోజకవర్గ స్థాయి రిటర్నింగ్ అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీతో దరఖాస్తుల స్వీకరణ పూర్తయిందని తెలిపారు. వీటిని త్వరగా పరిశీలించి అర్హులకు ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ చెప్పారు.

మాదక ద్రవ్యాల రవాణాను అడ్డుకోవాలి

జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. జిల్లా స్థాయి నార్కోటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో జరగగా, సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరా మూలాలను గుర్తిస్తే అరికట్టడం సులువవుతుందని చెప్పారు. సీపీ వారియర్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కట్టడి చేయాలని, లేనిపక్షంలో సమాజంపై దుష్ప్రభావాన్ని చూపుతుందని పేర్కొన్నారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో ఈనెల 27న జరిగే గణేష్ శోభాయాత్ర, నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి అధికారులతో సమావేశమైన ఆయన నిమజ్జనానికి చెరువుల వద్ద చేయాల్సిన ఏర్పాట్లు, కల్పించాల్సిన సౌకర్యాలపై సూచనలు చేశారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, మత్స్య శాఖ ఏడీ ఆంజనేయస్వామి, అదనపు డీసీపీ కే.ఆర్.కే.ప్రసాద్‌రావు, ఆర్డీఓలు జి.గణేష్, అశోక్‌చక్రవర్తి, ఎస్‌డీసీ రాజేశ్వరి, మునిసిపల్ ఈఈ కృష్ణలాల్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ కవితను కలిసిన ఎంపీ వద్దిరాజు



కవితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీలు రవిచంద్ర, కృష్ణయ్య, మాలోతు కవిత

ఖమ్మంమయూరిసెంటర్: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా ఎమ్మెల్సీ కవితను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఢిల్లీలో కవిత ఆందోళన చేయడంతోనే కదలిక వచ్చిందని పేర్కొన్నారు.

కమిషన్ అధ్యక్ష పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం, మెదక్ జిల్లాల వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలి నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ కలిగి, వినియోగదారుల వ్యవహారాలు తదితర అంశాల్లో కనీసం పదేళ్ల అనుభవం ఉండడంతో పాటు 35 నుంచి 65 ఏళ్ల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను 'రిజిస్ట్రార్ (ఎఫ్‌ఏసీ), తెలంగాణ స్టేట్ కన్స్యూమర్ డిస్ప్యూట్స్, రిడ్రస్సల్ కమిషన్, ఏరువాక బిల్డింగ్, శ్రీధర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా, ఖైరతాబాద్, హైదరాబాద్ – 500004' చిరునామాకు రిజిస్టర్ పోస్ట్, కొరియర్‌లో కానీ, నేరుగా కానీ ఈ నెల 25 సాయంత్రం 5 గంటల్లోపు చేరేలా పంపించాలని సూచించారు. దరఖాస్తుపై పోస్టు వివరాలు రాయడమే కాక రూ.వెయ్యి డీడీ సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

మాజీ మంత్రితో భేటీ

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన అనుచరులు శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఎంపీటీసీ ఎర్రగర్ల హన్మంతరావు, నాయకులు షేక్ షరీఫ్, బడేసాహెబ్, చేతుల నాగేశ్వరరావు, ఎం.రవీందర్, కై.రాజేందర్ తదితరులు కలిసి ఆయన వెంటే నడవనున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ కార్యదర్శిగా రాజారావు



రాజారావు

ఖమ్మంమామిళ్లగూడెం: మానవ హక్కుల పరిరక్షణకు ఢిల్లీ కేంద్రంగా కృషిచేస్తున్న ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ అంతర్జాతీయ కార్యదర్శిగా ఖమ్మంకు చెందిన పగిడిపల్లి రాజారావు నియమితులయ్యారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎండీ ముజాహిద్ తన నియామక పత్రాన్ని మెయిల్ ద్వారా పంపించారని రాజారావు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

52 మంది ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన శనివారం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా బజాజ్ అలియంజ్ ఇన్సూరెన్స్ కంపెనీ బాధ్యులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 52 మందిని ఎంపిక చేశారు. జాబ్‌మేళాకు 138 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి శ్రీరాం తెలిపారు.

కామేపల్లి ఆర్‌ఐ సస్పెండ్

కామేపల్లి: కామేపల్లి ఆర్‌ఐ–2గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. పెనుబల్లి మండలం ఆర్‌ఐగా విధులు నిర్వర్తించిన సమయాన అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో అధికారులు ఆయనపై విచారణ జరిపారు. ఈమేరకు అందిన నివేదికతో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

నలుగురి రిమాండ్

కామేపల్లి: పాతకక్షల నేపథ్యాన వ్యక్తిపై దాడి చేసిన నలుగురిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు కామేపల్లి ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పండితాపురంలో ఇటీవల బొమ్మగాని పిచ్చయ్యపై అదే గ్రామానికి చెందిన చల్లా శేషు, లాలయ్య, అప్పారావు, మేకపోతుల సైదులు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలపేట తండాలో డెంగీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ బాలపేట తండాలో శనివారం డెంగీ కేసు నమోదైంది. తండాకు చెందిన బాలుడు జ్వరంతో బాధపడుతుండగా పరీక్షించిన వైద్యులు డెంగీగా నిర్ధారించారు. శనివారం మంచుకొండ పీహెచ్‌సీ డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యాన బాలుడి ఇంటి పక్కల వారికి పరీక్షలు నిర్వహించి రక్తనమూనాలు సేకరించారు.

గంజాయి స్వాధీనం

కల్లూరు: ఒడిశా నుంచి ఏపీకి తరలిస్తున్న 21 కేజీల గంజాయిని కల్లూరు పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. కల్లూరులోని షుగర్ ఫ్యాక్టరీ వద్ద శనివారం ఎస్‌ఐ పి.రఘు ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒడిశాకు చెందిన సుజిత సుర్యా మోటార్ సైకిల్‌పై 21 కేజీల గంజాయితో ఆంధ్రప్రదేశ్‌లో అమ్మేందుకు వెళ్తుండగా పట్టు కున్నారు. గంజాయి విలువ రూ.4.20 లక్షలు గంజాయితో పాటు మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలి పారు. సిబ్బంది శ్రీనివాస్, సుందరం పాల్గొన్నారు.

ప్రైవేట్ డెయిరీలో పేలుళ్లు

- అర కి.మీ. మేర ఎగిరిపడిన రెండున్నర టన్నుల బాయిలర్
- రెప్పపాటులో ప్రాణాలతో బయటపడిన ఇద్దరు మహిళలు
- ఎగిసిపడిన ఇటుకముక్కలతో ఒకరికి గాయాలు
- అనుమతి లేకుండానే నిర్వహిస్తున్నట్లు గుర్తింపు



ఎగిరిపడి భూమిలో కూరుకుపోయిన బాయిలర్



ఘటనాస్థలిలో పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ పరిధి గోపాలపురం పంచాక్షరినగర్‌లోని ఓ ప్రైవేట్ మిల్క్ డెయిరీలో శనివారం పెద్ద ఎత్తున పేలుడు చోటుచేసుకుంది. ఒకేసారి భారీ శబ్దం రావడంతో స్థానికులు హడలిపోయారు. 2017లో హనుమాన్ పాల డెయిరీ పేరుతో ఏర్పాటు చేయగా, గత ఏడాది నుంచి శ్రీ సుదర్శన్ మిల్క్‌గా పేరు మార్చారు. అయితే, ఈ డెయిరీకి ఎలాంటి అనుమతి లేకపోగా, పేలుళ్ల తర్వాత వచ్చిన అధికారులు ఇక్కడ డెయిరీ నడుస్తున్న విషయమే తమకు తెలియదని పేర్కొనడం గమనార్హం.

భవనం లీజ్‌కు తీసుకుని..

2017లో ఖమ్మంకు చెందిన రజిత పేరుతో కృష్ణం రాజేశ్ పంచాక్షరీ కాలనీలో భవనాన్ని లీజ్‌కు తీసుకొని హనుమాన్ మిల్క్ ప్రొడక్ట్ పేరిట డెయిరీ ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత ఆయన ఏడాది కిందట గుంటూరుకు చెందిన రవీందర్‌బాబుకు సబ్ లీజుకు ఇచ్చాడు. అయితే, మొదటి నుంచి ఫ్యాక్టరీ అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నట్లు తెలిసింది. కాగా, శనివారం రోజు మాదిరిగానే బాయిలర్‌లో పాలు వేస్తుండగా, ఆపరేటర్ నరేశ్ తన కుమారుడికి ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రికి వెళ్లాడు. దీంతో బాయిలర్ కింద మంట అలాగే కొనసాగుతూ ఆవిరి ఎక్కువై ఒకేసారి పెద్ద శబ్దంతో పేలింది. రెండున్నర టన్నుల సామర్థ్యం కలిగిన బాయిలర్ భారీ శబ్దంతో పేలి ఎగిరి అర కిలోమీటర్ దూరంలో పడింది. ఈ సమయాన వచ్చిన శబ్దంతో ఏంజరిగిందో తెలియక స్థానికులు భయాందోళన చెందారు. కాగా, పేలుడు ధాటికి బాయిలర్ ఉన్న ప్రాంతంలోని ప్రహరీ కుప్పకూలగా, పెచ్చులు ఎగిరి సమీప ప్రాంతాల్లో పడ్డాయి.

అనుమతి లేకుండానే నిర్వహణ..

బాయిలర్ పేలిన విషయం తెలియగానే ఖమ్మం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఫ్యాక్టరీస్ శాఖ జూనియర్ అసిస్టెంట్ అబీద్ ఘటనాస్థలానికి వచ్చారు. ప్రస్తుతం డెయిరీని సబ్ లీజ్‌కు నడుపుతున్న రవీంద్రబాబు గుంటూరు వెళ్లినట్లు తెలియగా, ఆయన వచ్చాక విచారణ చేపడుతామని తెలిపారు. ప్రస్తుతం అనుమతి లేకుండానే డెయిరీని నిర్వహిస్తున్నట్లు గుర్తించగా, శాంపిల్స్ సేకరించినట్లు చెప్పారు. అలాగే, కార్పొరేటర్ లకావత్ సైదులు పరిశీలించి వివరాలు ఆరా తీశారు.

ఫోన్ రావడంతో దక్కిన ప్రాణాలు

ఆస్పత్రికి వెళ్లిన సూపర్‌వైజర్ నరేశ్ అక్కడి నుంచి డెయిరీకి ఫోన్ చేశారు. దీంతో అప్పటి వరకు బాయిలర్ వద్ద కట్టెలు ఎగవేస్తున్న ఇద్దరు మహిళలు కార్యాలయంలోకి వెళ్లగానే బాయిలర్ పేలింది. దీంతో రెప్పపాటు వ్యవధిలో వారిద్దరు ప్రాణాలతో బయటపడినట్లయింది.

బయట వారికి ప్రవేశం లేదు !

సాక్షి ఎఫెక్ట్..



కళాశాల గేట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డ్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలోకి బయట వ్యక్తులకు అనుమతి నిలిపివేశారు. ఉద్యోగులు, విద్యార్థులు మాత్రమే వచ్చేలా గేట్ల వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించారు. అలాగే, తల్లిదండ్రులు తమ పిల్లలను కలిసేందుకు కూడా సమయం నిర్దేశించారు. కళాశాలలో ఇటీవల తరగతులు ప్రారంభమైన నేపథ్యాన బయటి వ్యక్తులు వచ్చివెళ్తుండడం, ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో 'సాక్షి'లో శనివారం 'మెడికల్ కళాశాల ఆవరణలో ఇష్టారాజ్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ప్రిన్సిపాల్ సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. కళాశాలకు సంబంధం ఉన్న వారు తప్ప ఇతరులను రానివొద్దని ఆదేశించడంతో పాటు రెండు గేట్ల వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించారు. కాగా, కళాశాల ఆవరణలో బ్యాంక్, ఏటీఎం ఉండడంతో ఖాతాదారులు రావాల్సి వస్తుండడంతో ప్రత్యేక ప్రహరీ నిర్మాణానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

బాలలకు అండగా న్యాయసేవాసంస్థ



బాలలకు పుస్తకాలు అందజేస్తున్న న్యాయమూర్తి జావీద్‌పాషా

ఖమ్మంలీగల్: బాలలు సమాజంలో మంచి పౌరులుగా ఎదిగేలా న్యాయ సేవా సంస్థ తోడ్పాటునిస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్ పాషా తెలిపారు. ప్రపంచ బధిరుల దినోత్సవం సందర్భంగా నాయుడుపేటలోని జ్యోతినిలయం బధిరుల పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం చిన్నారులు నృత్యాలు, నాటికలు ప్రదర్శించాక న్యాయమూర్తి బాలలతో కలిసి కేక్ కట్ చేశారు. అలాగే, ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన సమకూర్చిన పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో కైలాష్ సత్యార్థి ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలుచేసి తీరుతాం

డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన విజయభేరి సభలో కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే అమలు చేసి తీరుతామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ వెల్లడించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ గతంలో ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేసినట్లుగానే, ఈ ఆరు హామీలను నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. అయితే, బీఆర్‌ఎస్ నేతలు ఏ హామీని నెరవేర్చకపోగా ఇప్పుడు తమ ప్రకటనలను ప్రశ్నించడం గర్హనీయమని పేర్కొన్నారు. కేఎంసీకి పన్నుల ద్వారా సమకూరిన ఆదాయాన్నే ఖర్చు పెడుతున్నారు తప్ప రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురాలేకపోయారని, జేఎన్‌టీయూ కాలేజీ పాలేరుకు తరలిపోగా తరగతులు మొదలుకాలేదని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావేద్ మాట్లాడగా పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, నాయకుడు పాలకుర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీపీఓ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీపీఓ హరికిషన్

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా పంచాయతీ అధికారిగా నియమితులైన ఇ.హరికిషన్ శనివారం విధుల్లో చేరారు. ఇన్నాళ్లు ఇన్‌చార్జ్ డీపీఓగా బాధ్యతలు నిర్వర్తించిన జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వీపీ గౌతమ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సత్తా చాటిన స్కేటింగ్ క్రీడాకారులు



పతకాలు సాధించిన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ టోర్నీలో జిల్లా స్కేటింగ్ క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 16, 17వ తేదీల్లో భువనగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి ఫస్ట్ ర్యాకింగ్ టోర్నీలో అండర్–17 కేటగిరీ బాలికల విభాగంలో బి.విశాలక్ష్మి రెండు స్వర్ణ పతకాలు, బాలుర విభాగం నుంచి డి.సాంబప్రసాద్ రెండు రజత పతకాలు గెలుచుకోగా, అండర్–7లో ఎల్.గౌతమ్, పి.ఆరాధ్య, అండర్–11లో ఐ.వ్యూహిత, బి.గీతిక్‌నాయక్ కాంస్య పతకాలు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా వారిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ కె.సురేశ్ తదితరులు శనివారం అభినందించారు.

గ్రూప్–1 అభ్యర్థులతో ప్రభుత్వం చెలగాటం

కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: గ్రూప్ – 1 అభ్యర్థులతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. తొలిసారి పేపర్ లీకేజీతో పరీక్ష రద్దు కాగా, ఇప్పుడు ప్రభుత్వ నిర్లక్ష్యంతో రద్దయిందని తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగ యువత రూ.లక్షలు వెచ్చించి పరీక్షకు సిద్ధమైతే ఇప్పుడు రద్దు చేయడంతో వారు ఆందోళన చెందుతున్నారన్నారు. కాగా, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి చెల్లించడమే కాక, మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని పొంగులేటి ఒక ప్రకటనలో తెలిపారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి

టీఎస్‌పీఎస్సీ తీరుతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్న నేపథ్యాన పూర్తిగా ప్రక్షాళన చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఖమ్మంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ – 1 అభ్యర్థులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో నాయకులు యువరాజు, శివ, చందూలాల్, నాగరాజు, వెంకటేష్, సతీష్, నరేష్, సంతోష్, ఆకాష్ పాల్గొన్నారు. కాగా, నిరుద్యోగుల విషయంలో కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గ్రూపు – 1 పరీక్ష రద్దయిందని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీతో దేశ సమగ్రతకు ముప్పు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు

ఖమ్మంమయూరిసెంటర్: మణిపూర్ మారణహోమంతో ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ దేశ సమగ్రతకు ముప్పు తీసుకొచ్చాయని సామాజిక, రాజకీయ విశ్లేషకులు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు ఆరోపించారు. డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యాన 'మణిపూర్ మారణకాండ – దేశ రాజకీయ ముఖచిత్రం' అనే అంశంపై ఖమ్మంలో శనివారం జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, మతోన్మాదాల నుంచి దేశాన్ని రక్షించుకోవడాన్ని అందరూ బాధ్యతగా భావించాలన్నారు. ఒకే జాతి, ఒకే చట్టం, ఒకే మతం అంటూ బీజేపీ రాజ్యాంగ మూలసూత్రాలపై దాడులు చేస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ.. కులమతాలను రాజకీయాల్లోకి జొప్పించిన బీజేపీ మతోన్మాద రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నున్నా నాగేశ్వరరావు మాట్లాడగా యూసీఎస్‌ఓ వ్యవస్థాపక అధ్యక్షుడు గుడిబండ్ల దీపక్, వివిధ సంఘాల నాయకులు మద్దాల ప్రభాకర్, బండి రమేశ్, షేక్ బషీరుద్దీన్, రోషన్‌ఖాన్, ఐవీ రమణారావు, రవిమారుత్, చింతల రమేశ్, శీలం వీరబాబు, సత్తెనపల్లి నరేశ్, భూక్యా ఉపేందర్, కూరపాటి శ్రీను, కె.సుజాత, బట్టు రాజు, దిండు మంగపతి, బొడ్డు మధు, గుమ్మ ముత్తారావు, కనపర్తి గిరి, రావులపాటి నాగరాజు, బడా శభాష్‌రెడ్డి, శ్యాం పాల్గొన్నారు.

మాలమహానాడు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌గా కాంతయ్య



ఉత్తర్వులు అందుకుంటున్న కాంతయ్య

పెనుబల్లి: మాలమహానాడు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌గా మేకతొట్టి కాంతయ్య నియమితులయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర ఉపాధ్యుడిగా ఉన్న ఆయనకు శనివారం మాలమహానాడు జాతీయ ముఖ్య సలహాదారుడు జూపూడి ప్రభాకర్ ఉత్తర్వులు అందజేశారు. త్వరలోనే కాంతయ్య ఆధ్వర్యాన జిల్లా, మండల కమిటీలను నియమించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హుస్సేన్, పరంజ్యోతిరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఖమ్మంఅర్బన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని, తద్వారా మానసికోల్లాసం, శారీరక దృఢత్వం సొంతమవుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ తెలిపారు. ఖమ్మం బల్లేపల్లిలోని బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న ఖమ్మం నార్త్ జోన్ పాఠశాలల స్థాయి క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసిన డీఈఓ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తే విజయాలు సిద్ధిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, పీఈటీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా, 31 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు.

పన్ను సవరణల అంశంపై రేపు సదస్సు

ఖమ్మంగాంధీచౌక్: పన్ను మినహాయింపులు, సవరణలపై రూపొందించిన నిబంధనలను వివరించేందుకు సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేసినట్లు ఆదాయ పన్నుల శాఖ అధికారి కె.సాయిశంకర్ తెలిపారు. ఖమ్మంలోని సీక్వెల్ రిసార్ట్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు సదస్సు మొదలవుతుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో తెలుగు రాష్ట్రాలు, ఒడిశా కమిషనర్ వి.కోటేశ్వరమ్మ, ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు నిబంధనలు, మత, ధార్మిక సంస్థలకు ఉన్న మినహాయింపులపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సు వివరాలను 98499 69124 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

26న ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

ఖమ్మంమామిళ్లగూడెం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 26న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఖమ్మం రీజియన్ జేఏసీ నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా శనివారం ధర్నా పోస్టర్లను ఖమ్మం డిపో గేటు వద్ద ఆవిష్కరించగా, జేఏసీ నాయకులు బేతంపుడి బుచ్చిబాబు, తోకల బాబు, అప్పారావు, సుధాకర్ మాట్లాడారు. ఆర్టీసీ విలీనం కంటే ముందే 2017 – 2021కు సంబంధించి వేతన సవరణ అమలు చేయాలని, బకాయి ఉన్న డీఏల నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో చేపడుతున్న ధర్నాకు ఉద్యోగులు తరలిరావాలని కోరారు. నాయకులు రమేశ్, వెంకన్న, వీరభద్రం, ఆర్‌ఎస్.నారాయణ, గుండు మాధవరావు, నర్సింహారావు, బసవయ్య, బీఎన్ రావు, ప్రసాద్, యాదగిరి, లక్ష్మణ్, ఆదిలక్ష్మి, బీబీ రెడ్డి, రోశయ్య, పాషా, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉచితం.. ఎగబడిన జనం

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో ఓ కంపెనీ సిబ్బంది లారీలో తీసుకొచ్చిన జ్యూస్ డబ్బాలను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ విషయం ఆనోట ఈనోట ప్రచారం జరగడంతో జనం ఎగబడ్డారు. రోడ్డును ఆనుకునే లారీ నిలిపి జ్యూస్ డబ్బాలు పంపిణీ చేయడంతో ట్రాఫిక్ జాం అయింది. కాగా, ఈ జ్యూస్ డబ్బాలు మరో అయిదు రోజుల్లో ఎక్స్‌పైరీ కానుండడంతోనే ఉచితంగా పంపిణీ చేయడం కొసమెరుపు.

లారీలోనుంచి ఎగిరి పడి వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: వేగంగా వెళ్తున్న లారీలో నుంచి ఎగిరిపడిన క్లీనర్ మృతి చెందిన ఘటన ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి క్రాస్ రోడ్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం .. ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురానికి చెందిన చేకూరి సుధాకర్ (33) లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 9న పంద్రేగుపల్లి నుంచి తిరిగి ఖమ్మం వైపు వస్తుండగా వెంకటగిరి క్రాస్ రోడ్ వద్ద గేదెలు అడ్డురావడంతో డ్రైవర్ ఎల్.రాములు సడన్ బ్రేక్ వేశాడు. కేబిన్ తలుపు తెరుచుకొని సుధాకర్ ఎగిరి పడగా తీవ్రగాయాలయ్యాయి. ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. డ్రైవర్ అజాగ్రత్తతోనే ఈ ఘటన జరిగిందని అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

ఆన్‌లైన్ గేమ్‌లతో అప్పుల పాలై ఆత్మహత్య

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తికి చెందిన బోడా రామకృష్ణ (34) ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడుతూ డబ్బు పోగొట్టుకుని అప్పులు పెరగడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిత్యం ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడే రామకృష్ణ తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. కుటుంబ సభ్యులు మందలించినా మార్పు రాకపోగా, అప్పులు తీర్చే పరిస్థితి లేకపోవడంతో శుక్రవారం గ్రామ సమీపాన గడ్డిమందు తాగి పడిపోగా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రామకృష్ణ శనివారం మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...

ఏపీలో 'ఇంగ్లిష్' విద్యావిధానం భేష్

సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి



ఖమ్మంగాంధీచౌక్: ఆంధ్రప్రదేశ్‌లో ఇంగ్లిష్ విద్యకు అక్కడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని సినీనటుడు, దర్శక, నిర్మాత ఆర్. నారాయణమూర్తి అభినందించారు. శనివారం ఖమ్మం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీలో ఇంగ్లిష్ మీడియం అమలును ప్రశంసించారు. ఇదే తరహా విధానాన్ని దేశవ్యాప్తంగా కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మాతృభాష తెలుగు అయినా.. మనుగడ భాష ఇంగ్లిష్ అన్నారు. మన జీతం, జీవితం ఇంగ్లిష్‌తోనే ముడిపడి ఉంటుందన్నారు. గ్రామం మొదలు ప్రపంచం వరకు గ్లోబలైజేషన్ అయిననేపథ్యంలో అందరూ ఆంగ్లం నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్య ద్వారా సామాజిక న్యాయం దక్కుతుందని, ఇంగ్లిష్ విద్య శక్తిమంతమైందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేర్కొన్నారని తెలిపారు.

కాంగ్రెస్ ఎంపీలు మహిళా బిల్లులో ఎందుకు పాల్గొనలేదు?

తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్ సాగర్

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశ సమయంలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు పాల్గొనలేదో సమాధానం చెప్పాలని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ నిలదీశారు. మహిళలను కాంగ్రెస్ పార్టీ చులకనభావంతో చూస్తుందని శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ కోసం ప్రధానమంత్రికి తెలంగాణ సీఎం కేసీఆర్ లేఖ రాశారని, దేశంలోని అన్ని పార్టీలకు ఎమ్మెల్సీ కవిత లేఖలు రాసి మద్దతు కూడగట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం బిల్లు పార్లమెంట్‌లో ఓటింగ్‌కు వచ్చినప్పుడు ఓటు వేయకుండా దొడ్డిదారిలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు బయటకు వచ్చారన్నారు.

బీజేపీ ఎంపీ రమేశ్ బిధూడీని అనర్హుడిగా ప్రకటించాలి: బీఎస్పీ

సాక్షి, హైదరాబాద్: బీఎస్పీ ఎంపీ కున్వర్ డానిష్ అలీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ రమేశ్ బిధూడీని వెంటనే లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించాలని తెలంగాణ బీఎస్పీ డిమాండ్ చేసింది. బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సాంబశివగౌడ్, అరుణ, మైనారిటీ విభాగం కన్వీనర్లు అబ్రార్ హుస్సేన్ ఆజాద్, మౌలానా షఫీ మసూది పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు.

అంతా కనికట్టు

మఖిలో పుట్టి పుబ్బలో మాయమైన డొల్ల కంపెనీలు

- కేవలం స్కిల్ స్కాం డబ్బులు తరలించడానికే ఏర్పాటు
- స్కిల్ ఒప్పందం కుదిరిన నాలుగు రోజుల్లోనే రూ.లక్ష మూల ధనంతో పీవీఎస్‌పీ–స్కిలర్ కంపెనీ ఏర్పాటు
- ఆర్వోసీ బ్యాలెన్స్ షీట్లలో బయటపడ్డ స్కిలర్ బాగోతం
- ఏ అనుభవం లేని ఆ కంపెనీకి రూ.241.49 కోట్లు బదిలీ
- విలువైన పరికరాలు సరఫరా చేసినట్లు దొంగ ఇన్వాయిస్‌ల సృష్టి
- 2014లో ఏర్పాటైన ఇన్‌వెబ్, పాట్రిక్ ఇన్ఫో, భారతీయ గ్లోబల్ కంపెనీలు 2018 తర్వాత మూత
- ఆర్వోసీలో నమోదు కాని కంపెనీల పేరిటా బిల్లులు చెల్లింపు




సాక్షి, అమరావతి: నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ పేరుతో డబ్బులు కొట్టేయడానికి టీడీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పక్కా ప్రణాళికతో అడుగులు వేశారు. స్కిల్ సెంటర్స్ పేరుతో డొల్ల కంపెనీల ద్వారా డబ్బు ఎలా తరలించాలో ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకున్న తర్వాతే ఏపీఎస్‌ఎస్‌డీసీని తెరపైకి తెచ్చి.. సీమెన్స్ ముసుగులో ఒప్పందం చేసుకున్నారు. ఎటువంటి పరికరాలు సరఫరా చేయకుండానే చేసినట్లు దొంగ ఇన్వాయిస్‌లను సృష్టించి రూ.241 కోట్లు కాజేశారు. ఈ బాగోతమంతా ఎన్‌ఫోర్స్‌మెంట్, జీఎస్టీ ఇంటెలిజెన్స్, సెబీ, ఫోరెన్సిక్ ఆడిట్స్‌లో పక్కా ఆధారాలతో బయటపడింది. ఇందుకోసం అప్పటికప్పుడు కొన్ని షెల్ కంపెనీలను పుట్టించగా, హవాలా మార్గంలో నగదును సరఫరా చేసే కొన్ని షెల్ కంపెనీలను ఎంచుకున్నారు. మొత్తం ఈ కుంభకోణంలో సీమెన్స్ ముసుగులో డిజైన్‌టెక్ కీలకంగా వ్యవహరించింది. డిజైన్ టెక్ నుంచి రెండు షెల్ కంపెనీలకు మొత్తం నగదును పంపించి, అక్కడ నుంచి అనేక షెల్ కంపెనీల ద్వారా తిరిగి ఆ నగదు చంద్రబాబు సూచించిన వ్యక్తులకు చేరినట్లు దర్యాప్తులో షెల్ కంపెనీల ప్రతినిధులు అంగీకరించారు.

రూ. లక్షతో రూ. 241 కోట్లు

నగదును తరలించడం కోసం స్కిలర్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (గతంలో పీవీఎస్‌పీ ఐటీ స్కిల్స్ ప్రాజెక్ట్‌గా పిలిచేవారు) పేరుతో ఒక డొల్ల కంపెనీని అప్పటికప్పుడు ఏర్పాటు చేశారు. ఏపీఎస్‌ఎస్‌డీసీతో ఒప్పందం కుదిరిన కొద్ది రోజులకే 2015 మార్చి30న స్కిలర్ కంపెనీని ఏర్పాటు చేసినట్లు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్వోసీ) డేటా స్పష్టం చేస్తోంది. న్యూఢిల్లీ కేంద్రంగా ప్రతిక్ రమన్‌భాయ్ పటేల్, అబ్దుల్ రఫుల్ హాయ్ కేవలం లక్ష రూపాయల మూల ధనంతో స్కిలర్ ఎంటర్‌ప్రైజెస్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి వరకు ఎటువంటి అనుభవం లేని ఈ కంపెనీకి ఏకంగా రూ.241.49 కోట్ల విలువైన హార్డ్‌వేర్ పరికరాలను సరఫరా చేసే కాంట్రాక్టును అప్పగించారు. 717 దొంగ ఇన్వాయిస్‌లను సృష్టించి వాటి ద్వారా డబ్బులు కొట్టేశారు. స్కిలర్ కంపెనీ 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఈ స్కిల్ ల్యాబ్స్‌కు రూ.241.49 కోట్ల విలువైన హార్డ్‌వేర్ పరికరాలను సరఫరా చేసి డబ్బులు తీసుకున్నట్లు దొంగ రికార్డులు సృష్టించారు. కానీ ఆ వివరాలను ఎక్కడా ఆ కంపెనీ అకౌంట్స్‌లో చూపించలేదు. 2016–17 సంవత్సరానికి స్కిలర్ కంపెనీ ఆర్‌వోసీకి సమర్పించిన ఆర్థిక స్టేట్‌మెంట్ ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఆ సంవత్సరంలో కేవలం రూ.99.03 కోట్ల విలువైన పరికరాలు మాత్రమే సరఫరా చేసినట్లు దొంగ లెక్కలు చూపించారు. వాస్తవానికి ఒక్క రూపాయి విలువైన పరికరాలు కూడా సరఫరా చేయలేదు. స్కిల్ కుంభకోణంపై సీఐడీ విచారణ ప్రారంభించిన తర్వాత స్కిలర్ తన దుకాణం మూసేసినట్లు ఆర్వోసీ రికార్డులు సూచిస్తున్నాయి. 2021లో చివరిసారిగా బ్యాలెన్స్ షీట్లు సమర్పించిన స్కిలర్ గత రెండేళ్ల నుంచి ఎటువంటి సమాచారాన్ని ఆర్వోసీకి ఇవ్వడం లేదు.

డబ్బులు వచ్చాక దుకాణం బంద్

స్కిలర్ చేతికి వచ్చిన రూ.241.49 కోట్లను పాట్రిక్ ఇన్ఫో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్‌వెబ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, భారతీయ గ్లోబల్ ఇన్ఫో మీడియా లిమిటెడ్, ఐటీ స్మిత్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి అనేక డొల్ల కంపెనీల ద్వారా చంద్రబాబు గూటికి తరలించేశారు. ఈ కంపెనీలు కేవలం స్కిల్ కుంభకోణం సమయంలో మాత్రమే కార్యకలాపాలు నిర్వహించాయని, ఆ తర్వాత పని చేయలేదని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. రూ.లక్ష మూలధనంతో 2012లో న్యూఢిల్లీ కేంద్రంగా ఏర్పాటైన ఇన్‌వెబ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే డొల్ల కంపెనీని 2016లో నగదు తరలించిన తర్వాత మూసేశారు. 2016లో చివరిసారిగా బ్యాలెన్స్ షీట్ సమర్పించిన ఈ కంపెనీ ఆ తర్వాత నుంచి ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించడం లేదని, ప్రస్తుతం ఇది మూతపడిన కంపెనీగా ఆర్వోసీ రికార్డుల్లో పేర్కొన్నారు. మరో డొల్ల కంపెనీ పాట్రిక్ ఇన్ఫో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా న్యూఢిల్లీ కేంద్రంగా రూ.లక్షతో మొదలైంది. స్కిల్ కుంభకోణం నిధుల తరలింపు పూర్తయిన తర్వాత 2018లో ఈ కంపెనీ మూతపడింది. 2018 తర్వాత ఈ కంపెనీ ఎటువంటి బ్యాలెన్స్ షీట్లను సమర్పించలేదని, ప్రస్తుతం ఈ కంపెనీ మూసివేసిన కంపెనీగా ఆర్వోసీ రికార్డుల్లో చూపిస్తోంది. రూ.లక్షతో న్యూఢిల్లీ కేంద్రంగా ప్రారంభమైన భారతీయ గ్లోబల్ ఇన్ఫో మీడియా లిమిటెడ్ 2018 డిసెంబర్ 10 తర్వాత నుంచి ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించడం లేదని ఆర్వోసీ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అంటే ఈ డొల్ల కంపెనీలన్నీ నగదు తరలించాక కనుమరుగయ్యాయని స్పష్టమవుతోంది. ఇలా దొంగ ఇన్వాయిస్‌లతో నగదును తరలించడమే కాకుండా, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను కోరుతూ దరఖాస్తు చేయడంతో పుణేలోని జీఎస్టీ ఇంటెలిజెన్స్ రంగంలోకి దిగి తీగ లాగితే మొత్తం డొంకంతా బయట పడింది.



2018 తర్వాత నుంచి భారతీయ గ్లోబల్ ఇన్ఫో మీడియా లిమిటెడ్‌లో ఎటువంటి కార్యకలాపాలు జరగడం లేదన్న విషయాన్ని స్పష్టం చేస్తున్న ఆర్వోసీ రికార్డులు

హవాలా నగదు తరలింపులో ఏసీఐ దిట్ట

అల్లైయిడ్ కంప్యూటర్స్ ఇంటర్నేషనల్ (ఆసియా) లిమిటెడ్ (ఏసీఐ) నకిలీ ఇన్వాయిస్‌లతో నగదును తరలించడంలో దిట్ట. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన ఈ కంపెనీకి ఈ విషయంలో పెద్ద రికార్డే ఉంది. 2013–14 నుంచి 2019–20 వరకు ఈ కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌ను పరిశీలిస్తే స్కిల్ కుభంకోణం సమయంలో ఏసీఐ ద్వారా ఎంత నగదు తరలించారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కుంభకోణం ముందు, తర్వాత ఏడాదికి రూ.లక్షల్లో మాత్రమే ఆదాయాన్ని చూపిన ఈ కంపెనీ.. కుంభకోణం సమయంలో రూ. కోట్లల్లో ఆదాయం చూపించడం గమనార్హం. ఒప్పందం కుదిరిన మొదటి సంవత్సరం అంటే 2015–16లో రూ.30.52 కోట్లు, 2016–17లో రూ.35.77 కోట్లు, 2018–19లో రూ.9.77 కోట్లు ఆదాయాన్ని చూపించిన ఈ కంపెనీ 2019–20కి వచ్చే సరికి కేవలం రూ.2 లక్షల ఆదాయాన్ని మాత్రమే చూపించింది. ఈ కంపెనీ లావాదేవీలపై అనుమానం వచ్చిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా 2017లో రంగంలోకి దిగి విచారణ ప్రారంభించింది. ఈ విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా సెబీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ వారికి సమాచారమిస్తే వారు ఆయా కంపెనీలకు నోటీసులు జారీ చేశారు. ఫోరెన్సిక్ ఆడిట్ సందర్భంగా కంపెనీకి, కంపెనీ డైరెక్టర్లకు నోటీసులు జారీ చేయగా, వారు నిజాలను ఒప్పేసుకున్నారు. ఎటువంటి వస్తువులు సరఫరా చేయకుండానే చేసినట్లు ఇన్వాయిస్‌లు సృష్టించి డిజైన్ టిక్ నుంచి నగదును తీసుకొని వాటిని వివిధ రూపాల్లో తిరిగి వారికే ఇచ్చినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు ఏసీఐ ఎండీ స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డు చేశారు. వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు పేరుతో రూ.241 కోట్లు డొల్ల కంపెనీల ద్వారా కొట్టేస్తూ సాక్ష్యాలతో బయటపడినా టీడీపీ మీడియా మా బాబు నిప్పు అంటూ అడ్డగోలుగా వాదనలు చేయడం వారికే చెల్లింది.

విశాఖ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- ఏపీ సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి వెల్లడి
- నీతి ఆయోగ్ గ్రోత్ హబ్స్ జాబితాలో వైజాగ్‌కు చోటు



సాక్షి, విశాఖపట్నం: నీతి ఆయోగ్ గ్రోత్ హబ్స్ జాబితాలో విశాఖపట్నం ఎంపికైన నేపథ్యంలో అభివృద్ధికి అవసరమైన భవిష్యత్ ప్రణాళికల్ని రూపొందిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, టూరిజం ఆర్‌డీ శ్రీనివాస్ పాణి, మెట్రోరైల్ ఎండీ యూజేఎం రావు తదితరులతో మాట్లాడారు. విభాగాల వారీగా విశాఖలో చేపట్టనున్న ప్రాజెక్టులు, ప్రస్తుతం పురోగతిలో ఉన్న ప్రాజెక్టుల స్థితిగతుల్ని అడిగి తెలుసుకున్నారు. విశాఖ అభివృద్ధికి సంబంధించిన భవిష్యత్ ప్రణాళికలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, బహుళ ప్రాజెక్టులతో విశాఖ రూపురేఖలు మారిపోతాయని చెప్పారు. వీఎంఆర్డీఏ పరిధిలో చేపట్టనున్న ప్రాజెక్టుల గురించి, మెట్రో రైలు కారిడార్ గురించి పీపీటీ ద్వారా జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్లు వివరించారు. మెట్రో రైలు ప్రాజెక్టు నాలుగు విభాగాలుగా రూపొందుతోందని మెట్రో ఎండీ యూజేఎంరావు తెలిపారు. మొదటి విభాగంలో స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు, రెండోది గురుద్వార జంక్షన్ నుంచి పోస్టాఫీస్ వరకు, మూడోది తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేర్ వరకు, నాలుగోది కొమ్మాది నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 76.90 కి.మీ. మేర వేస్తున్నట్టు చెప్పారు. లైట్ కారిడార్, మోడరన్ కారిడార్ పేర్లతో రూపొందుతున్న మెట్రో రైలు ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని జవహర్‌రెడ్డి సూచించారు. అనంతరం జవహర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అర్బన్ గ్రోత్ హబ్ సిటీస్ జాబితాలో విశాఖ చోటు దక్కించుకోవడం గర్వకారణమన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్‌గా వెలుగొందాలంటే అర్బన్ సిటీస్ గ్రోత్ సెంటర్స్ ముఖ్యమని నీతి ఆయోగ్ గుర్తించిందని తెలిపారు. ఇందుకోసం నీతి ఆయోగ్ బృందం టోక్యో, న్యూయార్క్ వంటి 20 ప్రపంచస్థాయి నగరాల్ని అధ్యయనం చేసి రోడ్ మ్యాప్ సిద్ధం చేసిందని, ఇందులో భాగంగా విశాఖని ఎంపిక చేసిందని వివరించారు. విశాఖ నుంచి ముఖ్యమంత్రి పరిపాలనపై త్వరలోనే సమీక్ష నిర్వహిస్తామని సీఎస్ చెప్పారు.

జిల్లా వార్తలు

విద్యార్థులకు హైకోర్టు జడ్జి దంపతుల చేయూత



విద్యార్థులకు రగ్గులు అందజేస్తున్న రాధాపరమేశ్వరి

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని సరస్వతి శిశు మందిర్ విద్యార్థులకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేశ్, రాధాపరమేశ్వరి దంపతులు రగ్గులు అందజేశారు. పాఠశాలలోని 100మంది విద్యార్థులకు రూ.30వేల విలువ చేసే రగ్గులను న్యాయమూర్తి సతీమణి రాధాపరమేశ్వరి శనివారం అందజేసి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి కాక ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గీతతో పాటు అన్నపూర్ణ, సుధాకర్, సరిత తదితరులు పాల్గొన్నారు.

నేడు నెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ బాలబాలికల జట్లను ఎంపిక చేసేందుకు ఆదివారం పోటీలు నిర్వహించనున్నారు. ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో ఈ పోటీలు జరుగుతాయని నెట్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి కె.ఫణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబరిచే వారితో ఎంపిక చేసిన జిల్లా జట్టు ఈ నెల 30 నుంచి మేడ్చల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఉదయం 11గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీ భక్తుల విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఉద్యోగి


భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భక్తులు శనివారం విరాళం అందజేశారు. ఎర్రగుంటకు చెందిన కల్లూరు ఓబుల్‌రెడ్డి–వెంకటలచ్చుమమ్మ దంపతులు రూ.50,116ను ఆలయ అధికారులకు అందజేయగా వారు దాతలకు రశీదు ఇచ్చి స్వామి దర్శనం చేయించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

తోట దాటని పుచ్చకాయ

- కొనే దిక్కు లేక రైతు ఆవేదన
- సంతల్లో తిరుగుతూ అమ్మకానికి ఆపసోపాలు
- దిగుబడి అద్భుతంగా ఉన్న వేళ దక్కని ఆదాయం



పడమటనర్సాపురంలోని తోటలో పుచ్చకాయలు (ఇన్‌సెట్) రైతు రాంబాబు



జూలూరుపాడు: భూమాతను నమ్ముకుని వ్యవసాయం చేసిన రైతుల పరిస్థితి దినదినగండంగా మారుతోంది. అతివృష్టి లేదంటే అనావృష్టితో పంటలు దెబ్బతినడం ఆనవాయితీగా మారింది. ఇవేమీ ఎదురుకాకుండా పంట దిగుబడి బాగున్న సమయంలో కొనే దిక్కులేక అవస్థ పడాల్సి వస్తోంది. ఇప్పుడు జూలూరుపాడు మండలానికి చెందిన ఓ గిరిజన రైతు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నాడు. మండలంలోని పడమటనర్సాపురానికి చెందిన గుగులోత్ రాంబాబు ఎకరం రూ.35 వేలు చొప్పున ఐదు ఎకరాలకు రూ.1.75లక్షలు చెల్లించి కౌలుకు తీసుకున్నాడు. ఇందులో బొప్పాయి సాగు చేయగా, అంతర పంటగా బాహుబలి రకం పుచ్చ సాగు ఎంచుకున్నాడు. రెండు పంటలకు కలిపి సుమారు రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టాడు. జూలైలో అధిక వర్షాల కారణంగా రెండు ఎకరాల్లో పుచ్చ పంట పాక్షికంగా దెబ్బతిన్నా మిగతా మూడెకరాల్లో పుచ్చ పంట బాగానే పండింది. దిగుబడి సుమారు 60మెట్రిక్ టన్నుల మేరకు రాగా.. ఇంతలోనే మార్కెట్‌లో ధర పడిపోవడంతో కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు.

ధర లేక ఇక్కట్లు

మార్కెట్‌లో మెట్రిక్ టన్ను పుచ్చకాయలకు గతంలో రూ.5వేల నుంచి రూ.6వేల పలికింది. కానీ ఇప్పుడు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు కూడా చెల్లించడానికి వ్యాపారులు రావడం లేదు. దీంతో రైతు రాంబాబు పుచ్చకాయలను కోసి ఇంట్లో రాశి పోశాడు. వ్యాపారులు ముందుకు రాకపోవడంతో చేను వద్దే తక్కువ ధరకు అమ్ముతున్నట్లు రైతు వెల్లడించాడు. అలాగే, వివిధ చోట్ల జరిగే వారాంతపు సంతలకు వాహనాల్లో కాయలు తీసుకెళ్లి ఎంతో కొంతకు అమ్ముకుంటున్నాడు. కాగా, సివిల్ ఇంజనీర్‌లో డిప్లొమా పూర్తిచేసిన రాంబాబు కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు కింద చేపట్టిన అన్నారం బ్యారేజీలో ఉద్యోగిగా పనిచేశాడు. 2019లో ఉద్యోగానికి రాజీనామా చేసిన ఆయన ఆసక్తితో వ్యవసాయంలో నిమగ్నం కాగా, ప్రస్తుత పరిస్థితితో ఇక్కట్లు ఎదుర్కొంటున్నాడు.

తెలంగాణ సంపదను దోచుకున్న కేసీఆర్..

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య
- కారేపల్లిలో ప్రారంభమైన ప్రజాపంథా శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పక్కన నాయకులు

కారేపల్లి: ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర సంపదను దోచుకున్న సీఎం కేసీఆర్.. తన సంపదను మరింత పెంచుకునేందుకు మూడోసారి ముఖ్యమంత్రి అయ్యేలా మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు గుమ్మడి నర్సయ్య ఆరోపించారు. కారేపల్లిలో ప్రజాపంథా జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసిందని, తద్వారా రాష్ట్రం ఇప్పుడు రూ.2 వేల కోట్ల మేర అప్పుల్లో కూరుకుపోయిందని తెలిపారు. దోపిడీ చేయాలనే ఆలోచన తప్ప తెలంగాణ సమగ్రాభివృద్ధికి కేసీఆర్ చేసిందేమీ లేదని విమర్శించారు. కాగా, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళా బిల్లును ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించినా అమలుపై మాత్రం స్పష్టత ఇవ్వడం లేదని తెలిపారు. తద్వారా బిల్లు అమల్లోకి రాకుండా మరో 15 ఏళ్ల కాలయాపన చేయాలనే కుట్ర ఉందని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తుండటంతో సామాన్యులు బతికే పరిస్థితి కరువైందని నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యా పరిరక్షణ కమిటీ జాతీయ నాయకుడు రమేశ్, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు వివిధ అంశాలపై మాట్లాడగా నాయకులు గుర్రం మచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆర్.శివలింగం, వై.పుల్లయ్య, ఆవుల అశోక్, జి.రామయ్య, అర్జున్‌రావు, వెంకన్న, బందెల వెంకయ్య, ఝాన్సీ, శిరోమణి, మంగతాయి, శోభారాణి, ఆజాద్, గుమ్మడి సందీప్, తేజ్యానాయక్, వీరన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



సాయికృష్ణ, అధ్యక్షుడు



వినయ్‌కుమార్, కార్యదర్శి

ఖమ్మంరాపర్తినగర్: బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య(బీడీఎస్‌ఎఫ్) రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఖమ్మం ఖానాపురంలోని పూలే అధ్యయన వేదికలో జరుగుతున్న బీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రతినిధుల మహాసభలు శనివారం రెండో రోజుకు చేరాయి. ఈసందర్భంగా రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా వడ్ల సాయికృష్ణ, కార్యదర్శిగా గోపె వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా దుబ్బేట ఆనంద్, కోశాధికారిగా పాడకంటి సుందరయ్య, సహాయ కార్యదర్శిగా ధనువేందర్‌తో పాటు 21 మందితో కమిటీని ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు కె.పర్వతాలు, తోకల సంజీవ్, సాదు మాల్యాద్రి, పాడకంటి రాంబాబు, లిక్కి కృష్ణారావు, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



ప్రధానోపాధ్యాయులతో సమీక్షిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రధాన సబ్జెక్టులకు అదనంగా సమయం కేటాయిస్తూ బోధించాలని తెలిపారు. విద్యార్థుల కోసం రూపొందించిన వర్క్ బుక్‌లు, మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకునేలా పర్యవేక్షించాలని చెప్పారు. సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌లో నిర్లక్ష్యం చేయొద్దు

కామేపల్లి: వ్యాధి నిరోధక టీకాల పంపిణీలో నిర్లక్ష్యం చేయొద్దని జాతీయ వ్యాధి నిరోధక టీకాల రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ అఖిల్ సూచించారు. కామేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని రామకృష్ణాపురంలో శనివారం ఆయన వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేశారు. గర్భిణులు, చిన్నారులు వేస్తున్న టీకాలు, నిల్వ పద్ధతులపై ఆరా తీసిన ఆయన రికార్డులను సైతం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ దూప్‌సింగ్, సిబ్బంది ఉషారాణి, కమల, విజయ తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ వర్క్‌షాప్‌లో తనిఖీ చేసిన సింగరేణి డైరెక్టర్



వర్క్‌షాపులో పరిశీలిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని మెయిన్ వర్క్‌షాపును డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణరావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వర్క్‌షాపులో తయారుచేసిన కన్వేయర్ రోలర్లు, రూఫ్ సపోర్ట్ సామగ్రిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ.. వర్క్‌షాపులో ఉత్పత్తి ప్రక్రియలో వేగం పెంచాలని, నాణ్యమైన విడిభాగాలు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. గనుల నుంచి బొగ్గు రవాణాకు ఉపయోగించే కన్వేయర్ రోలర్లను 50 శాతం మెయిన్ వర్క్‌షాపులో ఉత్పత్తి చేస్తుండగా, వీటి సంఖ్య మరింత పెంచాలని తెలిపారు. అనంతరం అప్రెంటిస్ విద్యార్థులతో మాట్లాడి సూచనలు చేశారు. సెంట్రల్ వర్క్‌షాపు జీఎం దామోదరరావుతో పాటు అధికారులు ఎస్.జగన్‌మోహన్‌రావు, కేవీ రావు, పి.రాజీవ్‌కుమార్, నరేశ్‌బాబు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు తక్షణమే అమలుచేయాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్/తిరుమలాయపాలెం: పార్లమెంట్‌లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి డిమాండ్ చేశారు. రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలుచేయాలనే డిమాండ్‌తో ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన జీపుజాతా శనివారం ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం, తిరుమలాయపాలెంతో పాటు ఖమ్మం నగరంలో కొనసాగింది. ఈ సందర్భంగా అరుణజ్యోతి మాట్లాడుతూ.. మణిపూర్ ఘటన నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు కేంద్రం మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చిందని ఆరోపించారు. అందుకే ఆమోదంతోనే సరిపెట్టి అమలుపై జాప్యం చేయాలని చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి పద్మ, మాచర్ల భారతి, నాయకులు బుగ్గవీటి సరళ, మెరుగు రమణ, మెహరున్నీసాబేగం, ఎస్కే బీబీ, సుమతి, అమరావతి, బేబీ, భాగం అజిత, కళమ్మ, సుమతి, శోభారాణి, అఫ్రోజ్, సమీనా, పద్మ, ప్రభావతి, ముత్తమ్మ, ఆర్.కృష్ణవేణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.